ఈనాడు
వనపర్తి
సోమవారం అక్టోబరు 7, 2024

మూడో వారంలో కొనుగోలు కేంద్రాలు



- పాలమూరులో 28 చోట్ల ఏర్పాటుకు చర్యలు
- క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధర

ఈనాడు, మహబూబ్‌నగర్: భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించే రైతులు ఆధార్‌తో అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాను తీసుకు రావాలని సీసీఐ మహబూబ్‌నగర్ శాఖ డీజీఎం మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈసారి పత్తి క్వింటాకు రూ. 7,521 మద్దతు ధరను సంస్థ ప్రకటించిందని చెప్పారు. పాలమూరులో మొత్తం 28 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెల మూడోవారంలో వీటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిన్నింగ్ మిల్లులు, రవాణాకు సంబంధించిన టెండరు ప్రక్రియ కూడా పూర్తి కావొచ్చిందన్నారు. ఉమ్మడి జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్ల ఏర్పాట్లపై డీజీఎంతో 'ఈనాడు' ముఖాముఖీలో వెల్లడించిన అంశాలిలా ఉన్నాయి.



సీసీఐ డీజీఎం మహేశ్వర్‌రెడ్డితో **ముఖాముఖి**

? పత్తికి మద్దతు ధర ఎలా ఉంది? వర్షానికి పంట దిగుబడి, తేమ శాతంపై ప్రభావం పడిందా? రైతుల పరిస్థితి ఏమిటి?

✔ పత్తికి సీసీఐ మద్దతు ధర రూ. 7,521గా నిర్ణయించింది. తేమ శాతం 8-12 మధ్యలో ఉండేలా చూసుకోవాలి. తేమ 8 శాతం ఉంటే పూర్తి మద్దతు ధర ఉంటుంది. తేమ శాతంలో తేడా ఉంటే ధరలో స్వల్ప మార్పు ఉంటాయి.

? ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు ఎంత? దిగుబడి ఎంత వస్తుందని అంచనా వేస్తున్నారు?

✔ ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,43,237 హెక్టార్లలో పత్తి సాగు చేశారు. సుమారు 30 లక్షల క్వింటాళ్ల పత్తి వస్తుందని అంచనా వేస్తున్నాం. వీటి ద్వారా 6.08 లక్షల బేళ్ల పత్తి వచ్చే అవకాశం ఉంది.

? రెండేళ్లుగా రైతులు ప్రైవేటు మార్కెట్‌ను ఆశ్రయిస్తూ నష్టపోతున్నారు? సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు? ఈసారి అదే పరిస్థితి ఎదురయ్యే అవకాశాలున్నాయా?

✔ గత రెండేళ్లు ప్రైవేటు మార్కెట్‌లో క్వింటాకు సీసీఐ మద్దతు ధర కంటే అధికంగా రేటు పలికింది. చాలా మంది రైతులు ప్రైవేటు మార్కెట్‌కు వెళ్లారు. తర్వాత విపణిలో పత్తికి డిమాండ్ తగ్గడంతో ధరలు తగ్గుతూ వచ్చాయి. ఈసారి సీసీఐ కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాయి.


? సీసీఐ ద్వారా విక్రయిస్తే రైతులకు డబ్బులు రావడానికి ఆలస్యమవుతుందని అంటున్నారు?

✔ సీసీఐ ద్వారా పత్తి విక్రయించే రైతులకు వారంలోగా డబ్బు ఖాతాలో జమవుతాయి. ఆధార్‌తో అనుసంధానం చేసుకున్న బ్యాంకు ఖాతాను మాత్రమే రైతు తీసుకురావాలి. కేవైసీ చేసుకోకుంటే డబ్బు రావడంలో సమస్యలు తలెత్తే అవకాశాలుంటాయి. కేంద్రాలకొచ్చే సమయంలో రైతు తన ఆధార్‌కార్డు తీసుకురావాలి. రైతు రాలేని పరిస్థితి ఉంటే కుటుంబ సభ్యుడిని పంపించవచ్చు. దీనికి సంబంధించిన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఇతర ధ్రువపత్రం తీసుకురావాలి.

? పత్తి కొనుగోలు కేంద్రాలెక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారు?

✔ పాలమూరులో మొత్తం 28 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. మహబూబ్‌నగర్-2, నాగర్‌కర్నూల్-18, నారాయణపేట-8, వనపర్తి-1, జోగులాంబ గద్వాలలో 1 చొప్పున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. టెండర్లలో పాల్గొన్న జిన్నింగ్ మిల్లులను త్వరలోనే నోటిఫై చేస్తాం. రవాణా వాహనాల కోసం టెండర్ల ప్రక్రియ త్వరలోనే పూర్తికానుంది.

ఉమ్మడి జిల్లాలో పత్తి పంట సాగు వివరాలు ఇలా(హెక్టార్లలో)..





ప్రమాదకరంగా వంతెన

పెబ్బేరు-రామాపురం రహదారి అధ్వానంగా మారింది. అడుగుకో గుంత ఉండటంతో ఈ దారిలో ప్రయాణమంటేనే జనం హడలిపోతున్నారు. మార్గంలోని వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పంచాయతీ రాజ్ ఏఈ కార్తీక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా రహదారి, కల్వర్టు నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. -న్యూస్‌టుడే, పెబ్బేరు పట్టణం

పురదారి.. పట్టదా మరి!

ఈనాడు పరిశీలన

పట్టణదారులు పాలకవర్గాల నిర్లక్ష్య పనితీరుకు అద్దం పడుతున్నాయి. అడుగు మేరకు గుంతలు ఏర్పడినా వాటి మరమ్మతులు చేయడం లేదు. కొన్ని చోట్ల అసంపూర్తి పనులు చేపట్టి చేతులుదులుపుకొన్నారు. ఛిద్రమైన దారులతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు.

అసంపూర్తి.. అధ్వానం..

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరులో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత దారులు అధ్వానంగా మారాయి. వీటి అభివృద్ధి, నిర్వాహణపై పురపాలిక, రహదారులు, భవనాల శాఖల మధ్య సమన్వయం లోపించింది. గాంధీచౌక్ కూడలి నుంచి అమరచింత వైపు ప్రధాన రహదారి అభివృద్ధి పనులు పురపాలిక రూ.2.20 కోట్లతో చేపట్టింది. 220 మీటర్ల మాత్రమే విస్తరణ పనులు పూర్తి అయ్యాయి. మరో 220 మీటర్ల పనులు ప్రారంభించలేదు. గాంధీచౌక్ కూడలి నుంచి పీజేపీ క్యాంపు వైపు ఉన్న ప్రధాన రహదారి మధ్య విభాగిని నిర్మించిన క్రమంలో బీటీ రహదారిని ఇరువైపులా అభివృద్ధి పనులు చేపట్టక రోడ్డు కోతకు గురవుతోంది. జూనియర్ కళాశాల, ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం, పోలీస్ స్టేషన్ ఎదుట రహదారి చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. బిల్లుల బకాయి పేరిట గుత్తేదారులు పనులు పూర్తి చేయడం లేదని పుర కమిషనర్ నాగరాజు తెలిపారు.



ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ప్రధాన రహదారి దుస్థితి

విస్తరణ మరిచారు..

అమరచింత, న్యూస్‌టుడే : పట్టణంలోని భగత్‌సింగ్ కూడలి నుంచి జోగిని కాలనీ మీదుగా విద్యుత్తు ఉపకేంద్రం వరకు ఉన్న ఆత్మకూరు- మరికల్ ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. పట్టణ అభివృద్ధి నిధులతో 500 మీటర్ల వరకు విభాగిని పనులు చేపట్టి రహదారి విస్తరణ మరిచారు. ఉన్న రహదారిలో ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేయలేని పరిస్థితి ఏర్పడింది. మురుగు కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు రహదారుల్లో నిలిచి అపరిశుభ్రతను తలపిస్తోంది. పుర అధ్యక్షురాలు వి. మంగమ్మను వివరణ కోరగా ఆత్మకూరు - మరికల్ ప్రధాన రహదారి విస్తరణ పనులకు నిధులు మంజూరు కావాల్సి ఉందని తెలిపారు. రూ.2 కోట్లతో కొత్తగా నిర్మించడానికి ప్రణాళికలు ప్రభుత్వానికి పంపినట్లు పేర్కొన్నారు.



జోగిని కాలనీ వద్ద ధ్వంసమైన రహదారి

అంతర్గత రోడ్లు.. గుంతలమయం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : వనపర్తిలో పలు కాలనీల్లో అంతర్గత రహదారులు గుంతమయంగా మారాయి. సీసీ రహదారులు వేసిన కొన్నాళ్లకే సిమెంటు ఊడిపోయింది. గుంతలు ఏర్పడటంతో వాహన చోదకులు, బాటసారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రమాదాలు జరగకముందే బాగు చేయాలని సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ఆయా కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' పుర కమిషనర్ పూర్ణచందర్‌ను వివరణ కోరగా.. ఇటీవల కురిసిన వర్షాలకు అంతర్గత రహదారుల్లో గుంతలు ఏర్పడ్డాయని, తాత్కాలిక మరమ్మతులు చేశామని తెలిపారు. నిధుల కోసం కౌన్సిల్ దృష్టి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.



విజయ్యనగర్ కాలనీలో పెచ్చులూడిన సీసీ రహదారి

రాళ్లు తేలాయి..

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : తాగునీటి పైపులైన్లు, కుళాయి కనెక్షన్లు, భవన నిర్మాణదారులు ఇతర పనుల కోసం రహదారులను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. అనంతరం గుంతలు పూడ్చకుండా వదిలేస్తున్నారు. అంతర్గత రహదారుల్లో వాహనాలు నడపాలంటే వాహనదారులు జంకుతున్నారు. దీనికి నిర్వహణ లోపంతో అవస్థలు తప్పడం లేదు. వర్షాలకు సమస్య తీవ్రంగా మారింది. రాళ్లు తేలడంతో రాకపోకలకు పాదచారులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. పురపాలక సంఘం ఏఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ పాలకవర్గ సమావేశంలో కొన్ని కాలనీకి చెందిన రహదారులకు తీర్మానం చేశామని తెలిపారు. మిగతావి త్వరలో టెండర్ల ప్రక్రియ నిర్వహించి మరమ్మతు చేయిస్తామన్నారు.



పాత బీసీ కాలనీలో దుస్థితి

తుంగభద్రలో భారీగా పెరిగిన ప్రవాహం

శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే : కర్ణాటక పరిధిలోని పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియడంతో తుంగభద్ర నదిలో ఆదివారం ప్రవాహం భారీగా పెరిగి 43,627 క్యూసెక్కులకు చేరింది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 10.8 అడుగుల ఎత్తులో నీటి ప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.6 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, రాష్ట్రానికి వచ్చేసరికి అది 5.6 అడుగులుగా ఉంది. ● రాజోలి శివారులోని సుంకేసుల జలాశయానికి ఆదివారం ప్రవాహం పెరిగింది. ఎగువ నుంచి జలాశయానికి 29,150 క్యూసెక్కుల వరద వస్తోంది.

గింజను కొలిచి.. బోనస్ ఇస్తారట!

కొత్త నిబంధన తేనున్న ప్రభుత్వం?

ధరూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం సన్నరకం వరి పండించే రైతులకు ఖరీఫ్ సీజన్‌లో క్వింటాల్‌కు రూ.500 వరకు బోనస్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా ఈ సీజన్‌లో ఇవ్వాలని నిర్ణయం తీసుకొంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తి తర్వాత స్థానంలో వరి ఉంది. జూరాల ప్రాజెక్టుతో పాటు ఎత్తిపోతల పథకాలు చెరువులు, బోరుబావుల కింద పెద్ద ఎత్తున రైతులు వరి సాగు చేశారు. సాగువిస్తీర్ణం దాదాపు 6.50 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 17లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా. ఇందులో 80 శాతానికిపైగా సన్నధాన్యమే ఉంటుంది. దసరా నుంచే కొనుగోళ్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రభుత్వం కొత్త నిబంధన అమల్లోకి తేవటానికి కసరత్తు చేస్తుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.



ధరూరు మండలం సాగైన వరి పంట

కొలుస్తారట: చిన్నచిన్న వస్తువుల పొడవు, వెడల్పు కొలతలు లెక్కించటం కోసం వినియోగించే కాలిపర్స్ పరికరాన్ని సన్నధాన్యం గుర్తించేందుకు వినియోగించనున్నట్లు సమాచారం. ఇందుకు పౌరసరఫరాల శాఖ సంస్థ ఇప్పటికే భారీ సంఖ్యలో కాలిపర్స్ పరికరాల కొనుగోలుకు నిర్ణయించినట్లు తెలిసింది. ప్రతి కొనుగోలు కేంద్రానికి కనీసం రెండు చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

కొలిచేదిలా: ధాన్యంలో పది గింజలను సేకరిస్తారు. ఒక ప్రత్యేక పరికరంలో వేసి వాటిపై పొట్టుపోయేలా చేస్తారు. తర్వాత వచ్చిన బియ్యపు గింజను కాలిపర్స్ ద్వారా కొలతేస్తారు. ఈ కొలతలో బియ్యం గింజ పొడవు 6 మిల్లీమీటర్లకన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు మిల్లీమీటరుకు మించొద్దు. బియ్యపు గింజ పొడవు, వెడల్పు నిష్పత్తి 2.5 మిల్లీమీటర్ల కన్నా ఎక్కువగా ఉండాలి. కాలిపర్స్‌లో పెట్టిన బియ్యపు గింజ ఈ కొలతలకు సరిపోతేనే దాన్ని సన్నధాన్యంగా పరిగణిస్తారు. అటువంటి వాటికే రూ.500 బోనస్ చెల్లిస్తారు.

ఎగ్గొంటేదుకేనా: సన్నరకం ధాన్యలేవి అన్నదానిపై ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. బీపీటీ-5202తో పాటు ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరాం రకాలతో పాటు మరో 33 రకాలను సన్న ధాన్యంగా పరిగణించాలని సూచించింది. అయితే ఈ 37 రకాల్లో మన ఉమ్మడి జిల్లాలో పండించేది ఐదు నుంచి ఆరు రకాలుంటాయి. అలాంటప్పుడు ఈ కొలతలు దేనికని రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయ శాఖ సన్నాల కింద ప్రకటించిన జాబితాలో రైతు పండించిన ధాన్యం ఉన్నా కొలతల్లో తేడా వస్తే దొడ్డు కింద పరిగణిస్తే ఎలాగని రైతులంటున్నారు. ఒక్కో వ్యవసాయ క్షేత్రంలో భూసారాన్ని బట్టి గింజ పరిమాణంలో తేడా ఉంటుందని రైతులంటున్నారు. కొలతల పేరుతో కొర్రీలు పెట్టి బోనస్ ఎగ్గొంటేందుకే ఈ కొత్త నిబంధన తెరపైకి వస్తోందని రైతులంటున్నారు.

పక్కరాష్ట్రంలో రేటెక్కువుంటే: ఇక ఉమ్మడి జిలాలో గద్వాల, నారాయణపేట వనపర్తి జిల్లాలకు సమీపంలో కర్ణాటక రాష్ట్రం రాయచూరు మార్కెట్ ఉంది. గతేడాది రూ.3,300 వరకు క్వింటా సన్నరకం ధాన్యం ధర పలికింది. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న బోనస్ కలిపినా పక్కరాష్ట్రంలో ఉన్న ధరకన్నా తక్కువే అవుతుంది. ఈసారి అదే ధర పలికితే రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే పరిస్థితి ఉండదు.

మార్గదర్శకాలు రాలేదు

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కేంద్రాల ఎంపిక పూర్తయింది. కేంద్రానికి వచ్చే ధాన్యం నాణ్యత తదితరాల పరిశీలనకు సంబంధించి ఇంకా మార్గదర్శకాలు రాలేదు. వస్తే ఆ ప్రకారమే అమలు చేస్తాం.

-విమల, పౌరసరఫరాల అధికారిణి, జోగులాంబ జిల్లా

ఉపాధ్యాయ ఖాళీలు మిగలకుండా ఏర్పాట్లు

మొదట ఎస్ఏల భర్తీ ● త్వరలో పాఠశాలలకు కొత్త టీచర్లు



ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

అచ్చంపేట, న్యూస్‌టుడే : డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ముగిసింది. ఈ నెల 1 నుంచి 5 వరకు ధ్రువపత్రాలను పరిశీలన చేయాల్సి ఉండగా మొదటి రోజు సాంకేతిక కారణాలతో ప్రారంభం కాలేదు. మిగిలిన నాలుగు రోజుల్లో ఒక్కో పోస్టుకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసే సమయంలో అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. జాగ్రత్తలు తీసుకోకుండా ఖాళీలను భర్తీ చేస్తే మళ్లీ అధిక సంఖ్యలో మిగిలిపోయే అవకాశం ఉంది. ఉపాధ్యాయ పదోన్నతుల సమయంలో ఈ పరిస్థితి ఏర్పడింది. కొందరు అభ్యర్థులు రెండు, మూడు సబ్జెక్టుల్లో అదనపు అర్హతలు సాధించడంతో వారు ఒకటి కన్నా ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. ఎంపికైన వారు వారికి ఆసక్తి ఉన్న ఏదో ఒక పోస్టును ఎన్నుకోవడంతో ఖాళీల ఇబ్బంది ఏర్పడింది. దీంతో మొదటి ఎస్ఏ ఖాళీలకు 1:1 నిష్పత్తిలో అభ్యర్థుల తుది జాబితాను రూపొందించి ఏ పోస్టును ఎంపిక చేసుకుంటారన్న విషయంలో ముందుగా డిక్లరేషన్ తీసుకున్నారు. ఎస్ఏ ఖాళీలను భర్తీ చేసిన తరువాత ఎస్‌జీటీలో వారు అర్హత సాధిస్తే అవి ఖాళీలుగా మిగిలి పోనున్నాయి. ఆ పోస్టుల్లో తదుపరి ర్యాంకు సాధించిన అభ్యర్థులను ఎంపిక చేసి అన్ని ఖాళీలు భర్తీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో జిల్లాలో 10 నుంచి 25 మంది అభ్యర్థులు రెండు, మూడు ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు.

జిల్లా	ఖాళీలు	దరఖాస్తుల పరిశీలన		
		అభ్యర్థులు	హాజరు	గైర్హాజరు
గద్వాల	172	416	387	29
మహబూబ్‌నగర్	243	576	552	24
నాగర్‌కర్నూలు	231	617	575	42
నారాయణపేట	279	664	585	79
వనపర్తి	152	363	341	22

2,440 మంది ధ్రువపత్రాలు పరిశీలన : డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు ఉమ్మడి జిల్లాలో 2,440 మంది హాజరయ్యారు. మొత్తం 1,077 ఖాళీల భర్తీకి 2,636 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా 196 మంది గైర్హాజరయ్యారు. ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేటర్లు కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో దానికి సంబంధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టలేదు. కోర్టు నిర్ణయం తరువాత ఈ పోస్టుల విషయంలో చర్యలు తీసుకోనున్నారు. ఖాళీల భర్తీతో పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడనున్నాయి.

తుది జాబితాల తయారీపై దృష్టి..: ధ్రువపత్రాల పరిశీలన పూర్తి కావడంతో తుది జాబితా రూపొందించడంపై అధికారులు దృష్టి కేంద్రీకరించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించడంతో పాటు వారికి సమాచారం అందజేయనున్నారు. ఎంపికైన వారికి 9న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఇప్పటికే పూర్తి చేశామని త్వరలో తుది జాబితాలను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని నాగర్‌కర్నూల్ డీఈవో డా.గోవిందరాజులు తెలిపారు. ఎస్ఏల ఖాళీల భర్తీ తరువాత వారు ఎస్‌జీటీలో కూడా ఎంపికైతే పేరు తొలగించి ప్రతిభ ఆధారంగా తదుపరి అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నామన్నారు.



శాకంబరిగా జములమ్మ

శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గద్వాల పుర పరిధిలోని జమ్మిచేడు జములమ్మ అమ్మవారు నాలుగో రోజైన ఆదివారం భక్తులకు శాకంబరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. -న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం

11 యూనిట్లలో జల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టు వద్ద ఆదివారం వరదనీటి ఉధృతి కొనసాగింది. ప్రాజెక్టుకు 77 వేల క్యూసెక్కుల వరద నీటి ఉధృతి కొనసాగుతుండగా పీజేపీ అధికారులు జల విద్యుత్తు ఉత్పత్తికి 35,837 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.172, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.668 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధ్యపడింది. ప్రస్తుత వర్షాకాలం ఎగువన 237.636, దిగువన 213.739 మిలియన్ యూనిట్ల మేర ఉత్పత్తి చేపట్టగలిగామని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

మంత్రి ఆదేశాలతో కదలిక వచ్చేనా!

గద్వాల, న్యూస్‌టుడే: నెట్టంపాడు పథకంలో కీలకమైంది ర్యాలంపాడు జలాశయం. లీకేజీలను అరికట్టి పూర్తిస్థాయిలో నీటినిల్వ (4.20 టీఎంసీల) ఉంచటానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజాగా గట్టు ఎత్తిపోతల పరిశీలనకు వచ్చిన భారీ నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం తక్షణం ర్యాలంపాడు మరమ్మతులకు సంబంధించి కార్యచరణ మొదలు పెట్టాలని ఈఎన్‌సీకి ఆదేశాలు ఇచ్చారు. మట్టికట్ట నుంచి వస్తున్న లీకేజీల సమస్యపై గతంలో ప్రైవేటు సర్వే సంస్థ జియో ఫిజికల్, ఎలక్ట్రోరెసిస్టీవిటీ విధానంలో పరీక్షలు చేసి మట్టి నమూనాలను సేకరించి చేయాల్సిన మరమ్మతులపై సంస్థ సాగునీటి శాఖకు నివేదిక ఇచ్చింది. అందుకు రూ.153 కోట్ల వరకు ఖర్చు కానున్నట్లు సాగునీటి శాఖ ప్రాథమిక అంచనా. ప్రస్తుతం జలాశయంలో 2 టీఎంసీలు మాత్రమే నిల్వ చేస్తుండటంతో జలాశయం పరిధిలోని 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండేళ్లుగా రబీలో పంట విరామం ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొంది.

కర్టెన్ గ్రౌంటింగ్‌కే మొగ్గు: జూరాల జలాశయం మట్టికట్టలో సైతం జలాశయంలో నీటినిల్వ పూర్తి స్థాయిలో చేసిన క్రమంలో 13 ఏళ్ల కిందట సీపేజీలు వచ్చాయి. వాటిని అరికట్టేందుకు మట్టికట్టపై కోర్‌డ్రిల్లింగ్ ప్రక్రియ ద్వారా రంధ్రాలు వేసి గ్రౌంటింగ్ ద్వారా మరమ్మతులు చేపట్టారు. తాజాగా ర్యాలంపాడు జలాశయం మట్టికట్టపై కూడా అదే పద్ధతిలో మరమ్మతులు చేపట్టాలని సాగునీటి శాఖ నిర్ణయించింది. వచ్చే డిసెంబరు నెలలో పనులు మొదలు పెట్టనున్నట్లు ఈఎన్‌సీ మంత్రి పర్యటన సందర్భంగా వెల్లడించారు. అయితే డిసెంబర్‌లో పనులు మొదలు పెట్టాలంటే ఇంకా 60 రోజుల గడువు మాత్రమే ఉంది. ఆర్థిక శాఖ క్లియరెన్స్‌లు, సీవోడీ ద్వారా డిజైన్స్ అప్రూవల్ అయి టెండర్ల ప్రక్రియ చేపట్టి ఒప్పందాలు పూర్తి చేసి పనులు మొదలు పెట్టడానికి కనీసం 50 రోజుల గడువు పడుతుంది. కాబట్టి అధికారులు అక్టోబరు నెలలోనే కార్యాచరణ మొదలు పెడితే కానీ డిసెంబర్‌లో పనులు మొదలయ్యే అవకాశం ఉండదు.

సామర్థ్యం పెంపుపై: గట్టు ఎత్తిపోతల పథకంలో 33 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ పథకం ద్వారానే నీటిని ఎత్తిపోసి సాగునీటిని ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం ర్యాలంపాడు జలాశయంలో నీటినిల్వ నాలుగు టీఎంసీలు ఉంటేనే గట్టు పథకానికి ఆయుష్షు ఉంటుంది. లేని పక్షంలో ఆ పథకమే విఫలమయ్యే పరిస్థితి ఉంటుంది. దీనిపై కూడా మంత్రి పర్యటన సందర్భంగా చర్చకు వచ్చింది. 4 టీఎంసీల సామర్థ్యం నుంచి 6 టీఎంసీలకు పెంచాలని స్థానిక నేతలు విజ్ఞప్తి చేశారు. దానిపైనా సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఈఎన్‌సీకి సూచించారు. ఇక గుడ్డెందొడ్డి లేదా గట్టు జలాశయాన్నే 15 టీఎంసీల సామర్థ్యం ఉండేలా రూపకల్పన చేయాలన్నది కూడా ప్రభుత్వం మదిలో ఉంది. సామర్థ్యం పెంచి స్టోరేజీ జలాశయాలుగా మార్చులు చేసి అవసరం ఉన్న సమయంలో జూరాలతో పాటు ఉమ్మడి జిల్లాలో ఎత్తిపోతల పథకాలకు రబీలో సాగునీటి కొరతకు శాశ్వత పరిష్కారం చూపాలని కూడా అనుకుంటున్నారు. అయితే వీటన్నింటికి అడుగు ముందుకు పడాలంటే తొలుత డీపీఆర్‌లు వెనువెంటనే ఆర్థిక శాఖ ఆమోదాలు, తదనంతరం ఆకృతుల పూర్తి అంచనా వ్యయంతో టెండర్ల ప్రక్రియ జరిగితే తప్ప అనుకున్న లక్ష్యాలు పూర్తి కావు.



రెండు టీఎంసీల నిల్వకే పరిమితమవుతున్న జలాశయం

వాస్కోడగామా రైలుకు ఘన స్వాగతం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : సికింద్రాబాద్ - వాస్కోడగామా (గోవా) 07039/40 రైలుకు మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం సికింద్రాబాద్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి జెండా ఊపి ఈ రైలును ప్రారంభించగా మహబూబ్‌నగర్ స్టేషన్‌కు వచ్చింది. స్థానిక సీనియర్ సిటిజన్లు, రైల్వే అధికారులు, ప్రయాణికులు రైలుకు స్వాగతం పలికారు. ఈనెల 9 నుంచి అధికారికంగా రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ప్రతి బుధ, శుక్రవారాల్లో సికింద్రాబాద్ - వాస్కోడగామా వైపు నడవనుంది. అలాగే తిరుగు ప్రయాణంలో వాస్కోడగామా - సికింద్రాబాద్ ప్రతి గురు, శనివారాల్లో నడవనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.



స్వాగతం పలుకుతున్న రైల్వే సీనియర్ సిటిజన్లు, రైల్వే అధికారులు

ముద్దబంతులు విరిసె.. బతుకమ్మ మురిసె!




బాలానగర్ మండలం గుండేడ్‌లో తోట

దేవరకద్ర మండలం గోప్లాపూర్‌లోని తోటలో నిలబడి చిత్రాలు దిగుతున్న ఓ కుటుంబం

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలనే దేవతగా పూజించటం బతుకమ్మ పండగ ప్రత్యేకత. పల్లెల్లో బాలికలు నిత్యం వివిధ పూలతో బతుకమ్మలు తయారు చేసి సాయంత్రం వేళ ఆడిపాడుతున్నారు. ఈ పండగ వేళ ఉండే గిరాకీని దృష్టిలో పెట్టుకుని రైతులు ఇప్పటికే బంతి, ఇతర పూలతోటలు సాగు చేశారు. దేవరకద్ర మండలం గోప్లాపూర్, బాలానగర్ మండలం గుండేడ్ గ్రామాల్లోని రైతుల పూలతోటలు ఇలా విరగబూసి అందరికీ కనువిందు చేస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించేవారు బంతితోటలోకి వెళ్లి చరవాణులతో చిత్రాలు దిగుతూ మురిసిపోతున్నారు. కాసేపు అక్కడే సేదతీరుతున్నారు. ఆ దృశ్యాలను 'ఈనాడు' క్లిక్‌మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే, జడ్చర్ల గ్రామీణం


మనసు పెడితే.. లక్ష్య ఛేదన సాధ్యమే!



'పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం విజయాన్ని చేకూరుస్తుంది. ఒక్క రోజులో దేన్నీ సాధించలేం.'

-స్వామీ వివేకానంద

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్: విజయాలు గాలి వాటంగా ఎప్పుడూ రావు. అదేదో సినిమాలో అన్నట్టు వంద కాదు.. రెండు వందల శాతం ప్రయత్నిస్తే ఏనుగు కుంభస్థలాన్నైనా కొట్టొచ్చు. సాధించాలనే తపన, అందుకు తగినట్లుగా శ్రమిస్తే విజయ తీరాలు వెతుక్కుంటూ మీ వద్దకే వస్తాయి. ఉమ్మడి జిల్లాలో పది, ఇంటర్ పరీక్షల్లో తప్పుతున్న వారి సంఖ్య రాష్ట్రంలోనే అధికంగా ఉంటోంది. ఇందుకు మనకు మనమే కారణం కాదా.. బోధనా లోపాలు, వసతులు లేవనే వాదనలు పక్కన పెట్టండి.. మన విజయానికి మనం చేస్తున్న కృషి ఎంతో ఆలోచించండి.. అప్పుడే ఇక రంగంలోకి దిగండి. విజయలక్ష్మి మిమ్మల్నెందుకు వరించదు. అది చదువైనా.. ఉద్యోగమైనా..



- నారాయణపేట జిల్లా కోస్గి పురపాలిక పరిధిలోని గుండ్లపల్లికి చెందిన సంతోష్ కుమార్ ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే అయిదు ఉద్యోగాలు సాధించాడు. నీటి పారుదల శాఖ ఏఈఈ, పాల్‌టెక్నిక్ కళాశాల అధ్యాపకునిగా, పురపాలిక పట్టణ ప్రణాళిక అధికారిగా, పంచాయతీరాజ్ ఏఈతో పాటు, గ్రూప్-4కు ఎంపికయ్యారు.
- మల్దకల్ మండలం ఎల్కూరుకు చెందిన మహ్మద్ సుభాన్ మూడు ఉద్యోగాలు సాధించారు. వేర్వేరు గురుకులాల్లో రెండు అధ్యాపక పోస్టులకు ఎంపికయ్యారు. అలాగే పంచాయతీ కార్యదర్శిగానూ ఉన్నారు.
- కొల్లాపూర్‌లో చుక్కాయిపల్లికి చెందిన స్వప్న ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌ఏ విభాగంలో జిల్లా రెండో ర్యాంకు, లాంగ్వేజ్ పండిట్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించింది.

- సైన్స్ చిత్ర పటాలు బాగా నేర్చుకోవాలి. విద్యార్థులతో కలసి చిత్రాలు వేయడం, సొంతంగా సాధన చేయాలి. ఇష్టమైన, సులభమైన పాఠ్యాంశాలను బాగా నేర్చుకోవాలి.
- సాంఘిక శాస్త్రంలో మ్యాప్‌లను చూడటం, దేశాలు, రాష్ట్రాలను గుర్తిస్తూ నేర్చుకోవడం, చరిత్రను గుర్తించుకునేలా పుస్తకాలు చదవడం.



- గణితంలో ప్రాథమిక భావనలు(కాన్సెప్ట్) బాగా నేర్చుకోవాలి. ప్రతి రోజూ రెండేసి లెక్కలు సాధనచేసినా పరీక్షల నాటికి 500 నేర్చుకోవచ్చు.
- ప్రణాళికా ప్రకారం ఇంగ్లిష్ గ్రామర్ నేర్చుకోవాలి. తోటి స్నేహితులతో చర్చించి లెటర్ రాయడం అలవాటు చేసుకోవాలి. అపరిచిత గద్యభాగంపై సాధన చేయాలి.
- హిందీ వ్యాకరణంపై దృష్టి పెట్టాలి. నేర్చుకోవడం, ఇతర విద్యార్థులతో మాట్లాడుతూ ఉండటం ద్వారా పట్టు సాధించవచ్చు.
- తెలుగులో అక్షర దోషాలు, కొట్టివేతలు లేకుండా, వాక్య నిర్మాణం సరిగా ఉండేలా సాధన చేయాలి. చక్కటి దస్తూరీ ప్రధానం.
- గత పరీక్షల ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. పాఠ్య పుస్తకం చదవడం అంశాల వారీ ప్రాధాన్యత తెలుసుకోవచ్చు.
- ఇతర వ్యాపకాలు తగ్గించి చదువుపైనే దృష్టి పెట్టాలి. సబ్జెక్టుల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

ఇలా చేయాలి

- నిరంతర అభ్యసనం ప్రధానం. దీని ద్వారా అనేక సమస్యలకు సమాధానాలు సొంతంగా తెలుసుకుంటారు.
- ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు, వాటిని నేర్చుకొని అమలు చేయాలి.

ఇప్పటి నుంచే: తరగతి ఏదైనా విద్యార్థి వారి సామర్థ్యాలకు తగ్గట్లుగా రాణించడం ముఖ్యం. ఉమ్మడి జిల్లాలో గతేడాది పదో తరగతిలో 44,898 మంది పరీక్షలు రాస్తే, 5,575 మంది అనుత్తీర్ణులయ్యారు. ఇంటర్‌లో 36 వేల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తే.. 30 శాతానికిపైగా ఫెయిలయ్యారు. వీరు పరీక్ష తప్పడంలో ఇతర కారణాలతో పాటు స్వ తప్పిదాలు ఉన్నాయి. ఇలాంటి నేపథ్యంలో రానున్న వార్షిక పరీక్షల్లో విజయం సాధించేందుకు ఇప్పటి నుంచే విద్యార్థులు మనసా వాచా కర్మణా పూర్తి స్థాయిలో దృష్టి సారించాలి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఇంకా 5 నెలలకు పైగా సమయం ఉంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికా బద్ధంగా చదవగలిగితే విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని అవలీలగా చేరుకోవచ్చు. జిల్లా ఖ్యాతినీ ఇనుమడింపజేయవచ్చు.



త్రికరణ శుద్ధితో చదవాలి: కొందరు విద్యార్థులు చేయాల్సింది చేయకపోవడం, అవసరం లేనిది చేస్తుండటంతో వెనుకబడిపోతున్నారు. ఇలా కాకుండా ప్రతి విద్యార్థి ఎందుకు చదవాలి? లక్ష్యం ఏమిటనేది తెలుసుకోవాలి. వారిలో ఎదగాలనే కోరిక ఉండాలి. ప్రతి విద్యార్థికి చదువు చిట్టచివరి లక్ష్యం కావాలి. త్రికరణ శుద్ధితో చదవాలి. అందుకు అనుగుణంగా శ్రమిస్తే రాణించడం పెద్ద కష్టమేమీకాదు. మూలాలపై శ్రద్ధ పెట్టి ముందుకెళితే తప్పకుండా విజయం సాధిస్తారు.



-డా.శ్రీనాథాచారి, వ్యక్తిత్వ వికాస నిపుణులు

సర్పాలన్నీ విషపూరితం కాదు

మన్ననూరు (అమ్రాబాద్), న్యూస్‌టుడే : పరిసరాల్లో కన్పించే సర్పాలన్నీ విషపూరితమైనవి కాదని అందులో రెండు మాత్రమే విషపూరితమైనవని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సదాశివయ్య పేర్కొన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని మన్ననూరులో నిర్వహించిన పాముల ప్రదర్శనలో పాములపై అవగాహన కల్పించారు. పాములు పర్యావరణ పరిరక్షణలో పాములది కీలక పాత్ర అన్నారు. పంటలకు చేటు చేసే ఎలుకలు, చిన్న చిన్న జీవులను పాములు తింటాయన్నారు. మన పరిసరాల్లో ముఖ్యంగా 8 రకాల సర్పాలున్నాయని అందులో నాగుపాము, కట్ల పాము మాత్రమే విషపూరతమైనవన్నారు. పాములను చంపకుండా వదిలేస్తే పొలాల్లోని ఎలుకలు, చిన్న కీటకాలను తిని జీవిస్తాయన్నారు. తమకు ప్రమాదం ఉందని భావించిన సందర్భంలోనే పాములు కాటేస్తాయన్నారు. వాటికి మనం ఏ హానీ తలపెట్టకపోతే అవి మనను ఏమి చేయవన్నారు. ఈ సందర్భంగా పలు రకాల పాములను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ రామమూర్తి, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు, చిన్నారులు పాల్గొన్నారు.



మన్ననూరులో పాములపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు సదాశివయ్య, ఎఫ్‌డీవో రామమూర్తి

రూ.2.79 కోట్లతో అలంకరణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీమాతను రూ. 2. 29 కోట్ల నగదుతో ధనలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం సభ్యులు స్వచ్ఛందంగా అలంకరణకు నగదును సమర్పించారు. తెల్లవారుజామున ప్రారంభమైన అలంకరణ మధ్యాహ్నం 11. 30 గంటల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్య వైశ్య దంపతులు అష్టోత్తర నామావళి పారాయణం, కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు.



ఉమామహేశ్వరం ధర్మకర్తల మండలి నేడు ప్రమాణస్వీకారం

భోగ మహేశ్వరంలో ఏర్పాట్లు ● హాజరు కానున్న మంత్రి కొండా సురేఖ

అచ్చంపేట, న్యూస్‌టుడే : ప్రముఖ శైవ క్షేత్రం ఉమామహేశ్వర ధర్మకర్తల మండలి కొత్త పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఈవో శ్రీనివాస రావు తెలిపారు. ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. మంత్రి హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్ నుంచి బయలు దేరి మధ్యాహ్నం 12. 50 గంటలకు అచ్చంపేటలోని ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఉమామహేశ్వరం చేరుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. తరువాత ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార సభలో పాల్గొని మాట్లాడనున్నారు. తరువాత అచ్చంపేటకు చేరుకొని మహాలక్ష్మి పథకం లబ్ధిదారుల సమావేశంలో పాల్గొననున్నారు.



నల్లమల కొండలపై వెలసిన ఉమామహేశ్వరం ఆలయం

● ధర్మకర్తల మండలి కొత్త పాలకవర్గంలో 14 మంది సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కొండ దిగువన భోగ మహేశ్వరంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఛైర్మన్‌గా పులిజాలకు చెందిన బీరం మాధవరెడ్డిని నియమించారు. కొండపైకి రహదారి విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని మంత్రికి కొత్త పాలకవర్గం వినతిపత్రం అందజేయనుంది.

పట్టపగలే.. దొంగా దొంగ..!



వస్త్రాలను చిందర.. వందర వేసిన దృశ్యం(పాత)

న్యూస్‌టుడే- మక్తల్ పట్టణం



దొంగతనాలు అంటే చిమ్మ చీకట్లో జరిగేవి. ఒకప్పుడు ఏదైనా చోరీ జరిగినప్పుడు ఇది ఏ ముఠాపని అయి ఉంటుందో అన్న కోణంలో పోలీసులు విచారించేవారు. ఇటీవల కాలంలో పట్టపగలు, మిట్ట మధ్యాహ్నం చోరీలు జరగడం పరిపాటిగా మారింది. మామూలు వ్యక్తులుగా సంచరిస్తూ, తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇరుగు,పొరుగు వారికి కూడా అనుమానం రాని రీతిలో తాళాలను కోసేసి గుంభనంగా పని కానిచ్చేస్తున్నారు. పట్టణాల్లో సాంకేతికత అందుబాటులోకి రావడంతో సులువుగా పట్టుబడతామని భావించి తెలివిగా గ్రామాలను అడ్డాగా మార్చుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్నవారి స్థితిగతులను ముందే అధ్యయనం చేస్తున్నారు.

● పల్లెల్లో సీసీ కెమెరాలు వంటి సాంకేతికత అందుబాటులో లేకపోవడం, జనం పనుల నిమిత్తం పొలాలకు వెళ్లడంతో పట్టపగలు వారి పని సులువు అవుతోంది. గతంలో జరిగే దొంగతనాలను చాలా వరకు చరవాణిల ఆధారంగానే కనుగొనేవారు. దొంగలు తెలివిగా చరవాణులను వెంట తీసుకురాకుండా ద్విచక్రవాహనాలపై గ్రామాలకు చేరుకొని తమ పని చేసుకొని ఉడాయిస్తున్నారు. చుట్టాల ఊరికి వచ్చినట్లు కలర్ ఇస్తూ ఎవరికీ అనుమానం రాని రీతిలో సంచరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.



కాచ్‌వార్ గ్రామంలో చోరీకి గురైన ఆభరణాల పెట్టెలు (పాత)

ఏం చేయాలి?

- పట్టపగలు తాళం వేసుకుని వెళ్లకుండా ఇంట్లో ఎవరినైనా ఉంచాలి. తప్పనిసరి వెళ్లాల్సివస్తే ఇరుగు, పొరుగువారిని అప్రమత్తం చేయాలి. ప్రస్తుత రోజుల్లో చరవాణి లేని వ్యక్తి అంటూ ఎవరూ ఉండరు. ఇంట్లో ఏదైనా అలికిడి జరిగేటప్పుడు చరవాణికి సంకేతాలు వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలి. మార్కెట్‌లో అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయి.
- విలువైన వస్తువులు, బంగారం వంటివి బయటకు వెళ్లేటప్పుడు తెలిసిన వారికి అప్పగించాలి.
- గ్రామంలో అపరిచితులు ఎవరైనా ప్రవేశిస్తే గట్టిగా ప్రశ్నించి నిర్ధారించుకోవాలి.



మచ్చుకు కొన్ని ఘటనలు

- మక్తల్ మండలం కాచ్‌వార్‌లో అశోక్ రెడ్డి ఇల్లు ఊరికి చివరన ఉండటం, తాళం వేసి ఉండటంతో పట్టపగలు చోరీ జరిగింది. కాట్రేవ్‌పల్లి, మంథన్‌గోడ్ గ్రామాల్లోనూ పట్టపగలు చోరీలు జరిగి నగదు, నగలు అపహరణకు గురయ్యాయి. ఊట్కూరు మండలం చిన్నపొర్లలోనూ పట్టపగలు నగదు, డబ్బులు దొంగతనం చేశారు. నారాయణపేట మండలం పెద్దజట్రంలో అదే రీతిలో జరిగింది. వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం జానంపేటలో ఒకేరోజు మూడు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లో ఏకంగా ఏటీఎం మిషన్‌ను గ్యాస్‌కట్టర్‌తో ధ్వంసం చేసి నగదు దోపిడీ చేశారు.
- ఇటీవల కోస్గి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి బ్యాంకు రుణం కట్టేందుకు పేట వచ్చారు. రూ. 3లక్షలకు పైగా నగదు ఉన్న బ్యాగును కారులో ఉంచి రోడ్డుపై వాహనం నిలిపి బ్యాంకులోకి వెళ్లాడు. అప్పటికే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారును వెంబడించి అదును చూసి కారు అద్దాలు పగలగొట్టి అపహరించుకుని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. సీసీ కెమెరాలో అంతా రికార్డు అయినా ఇంతవరకు దొంగలు దొరకలేదు.
- నారాయణపేట జిల్లాలో 97, మొత్తం ఉమ్మడి జిల్లాలో 550 వరకు చోరీ ఘటనలు జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగాయి. వాటిని విశ్లేషించినప్పుడు పట్టపగలు దొంగతనాలు ఎక్కువగా జరగడం పోలీసులను నివ్వెరపరుస్తోంది.


జోగులాంబకు ఏపీ ప్రభుత్వం నుంచి పట్టు వస్త్రాలు



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న కర్నూల్ కలెక్టర్ రంజిత్ బాషా దంపతులు

అలంపూర్, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కుటుంబ సమేతంగా జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈవో పురేందర్, అర్చకులు, ఛైర్మన్ నాగేశ్వర్ రెడ్డి కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం స్వామి, అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తుల రద్దీ: ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు.



భిన్నంగా నడపాలని..!

నేటితరం చిన్నారులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అధికంగా ఉంటోంది. వినూత్న ప్రయోగాలు చేసి అందరి దృష్టిని ఆకర్షించాలనే తపన వారిలో కనిపిస్తోంది. భూత్పూర్ మండలం ఎల్కిచర్ల గ్రామంలో ఓ బాలుడు తన సైకిల్ చక్రాలకు ఉన్న రెండు టైర్లను తొలగించాడు. కేవలం రిమ్‌లతోనే సైకిల్‌ను తొక్కుతూ ఇలా 'ఈనాడు' కెమెరాకు చిక్కాడు.

- ఈనాడు, మహబూబ్‌నగర్

కమ్యూనిస్టుల ఎజెండా లేకపోతే దేశానికి భవిష్యత్తు లేదు

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: కమ్యూనిస్టుల ఎజెండా లేకపోతే దేశానికి భవిష్యత్తు లేదని, దేశంలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయాలు, రాజ్యాంగాలకు రక్షణ లేదని, ఈ సమస్యలకు రక్షణగా నిలిచి దాని కోసం పోరాటం చేసేది ఒక్క కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా సీపీఎం కార్యదర్శి జబ్బార్ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష్మీదేవమ్మ సంస్మరణ సభలో మాజీ ఎంపీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు మధు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, మాజీ ఎంపీ, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డిలతో కలసి తమ్మినేని వీరభద్రం లక్ష్మీదేవమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశంలో మూడోసారి మతోన్మాద వ్యక్తుల చేతుల్లో పాలన సాగుతుందని, ఆర్థిక సంపద అంతా అదానీ, అంబానీలకు పంచి పెడుతున్నారన్నారు. రైతు రుణమాఫీలో ఇంకా 18 లక్షల మందికి రూ. 17 వేల కోట్లు బ్యాంకులో వేయాల్సి ఉందని, దాని కోసం రైతుల పక్షాన పోరాటం చేస్తున్నామన్నారు. భాగ్యనగరంలో ఆక్రమించిన చెరువుల కాల్వలను వాటిని పునరుద్ధరించాలన్నా పేరుతో ప్రభుత్వం హైడ్రా పేరిట కూల్చివేతలు ప్రారంభించిందని, దీనిని సీపీఎం పార్టీ వ్యతిరేకించడం లేదని కానీ, పేదల జోలికి వస్తే మాత్రం పూర్తిగా ఖండిస్తామన్నారు. నల్లగొండ జిల్లా వెంట ప్రవహించే మూసి నీటితోనే పొలాలు పండించే పరిస్థితి ఆయా ప్రాంతాల్లో ఉందని వీటి పై దృష్టి పెట్టకుండా సుందరీకరణ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజాహితం కోరుతూ ప్రజల తరపున పోరాటానికి మనం చేయాల్సిన పని చేయాల్సిందేనని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సీపీఐ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, విజయరాములు, అర్జున్, పుట్ట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నర్వ, న్యూస్‌టుడే : లంకాల గ్రామానికి చెందిన దుప్పల్లి శ్రీనివాసులు, అతని కుమారుడు రాముతో కలిసి ఆదివారం ద్విచక్ర వాహనంపై రాంపూర్ గేటు నుంచి సొంతూరు లంకాల వస్తున్నారు. లంకాల చెరువుకట్ట దాటిన తర్వాత మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని పటాన్‌చెరుకు చెందిన బులేరో వాహనం ఢీకొంది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరూ కిందపడి క్షతగాత్రులయ్యారు. శ్రీనివాసులు(45) తలకు బలమైన గాయాలై రక్తస్రావం జరిగింది. చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా రాత్రి మృతిచెందారు. రాము కుడికాలుకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమయ్య తెలిపారు.

కారు బోల్తాతో మరొకరు..

ఇటిక్యాల, న్యూస్‌టుడే: జాతీయ రహదారి పక్కకు కారు బోల్తా పడి ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాదు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు ఎర్రవల్లిచౌరస్తా సమీపంలోని విజయవర్ధిని ఆయిల్ మిల్లు ఎదురుగా అదుపుతప్పి జాతీయ రహదారి పక్కకు బోల్తాపడింది. దీంతో స్వయంగా కారు నడుపుకుంటూ వెళ్తున్న కర్నూలులోని శ్రీనివాసనగర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి(60) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఆయన ఒక్కరే ఉన్నారు. కర్నూలు జిల్లా పంచలింగాల సమీపంలోని ఆల్కాలిస్ పరిశ్రమలో పనిచేస్తున్నట్లుగా స్థానికులు గుర్తించారు.

రోడ్డు ప్రమాద మృతుడు ఛత్తీస్‌గఢ్ కూలీ

గాయపడిన మరొకరి పరిస్థితి విషమం

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్ల కొత్త బస్టాండు సమీపంలోని ఫ్లైఓవర్‌పై శనివారం అర్ధరాత్రి తర్వాత 1.30 గంటలకు జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన విషయం 'ఈనాడు' పాఠకులకు విధితమే. వారిని ఛత్తీస్‌గఢ్ కూలీలుగా పోలీసులు గుర్తించారు. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ముర్హ(54), కాలురాం రెండు వారాల క్రితం బతుకుదెరువు కోసం జడ్చర్లకు వచ్చారు. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం సమీపంలోని ఇటుక బట్టీలో కూలీగా పని చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే ఉంటున్నారు. ఆ ఇద్దరూ కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వచ్చారు. జాతీయ రహదారి-44పై ఫ్లైవర్ మీదుగా నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొట్టింది. ముర్హ అక్కడికక్కడే మృతిచెందగా కాలురాం తీవ్రంగా గాయపడ్డాడు. కాలురాంను హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉంది. ముర్హ కుమారుడు రాంనారాయణ్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.



చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

సమస్య: పట్టణంలో రెండేళ్ల క్రితం రూ.50 లక్షలతో చేపట్టిన రహదారి విభాగిని పనులు పలు చోట్ల ధ్వంసమయ్యాయి. నిర్మించిన గోడల ఇటుకలు ఊడుతున్నాయి. వర్షం వస్తే మట్టి పోతుంది. **- రాములు, అమరచింత**



అమరచింత: రహదారి విభాగిని గోడ ఇటుకలు ఊడిన చిత్రం

సమాధానం: రహదారి విభాగిని పనులు చేపట్టిన చోట ఎక్కడైన గోడలు ధ్వంసమై ఇటుకలు ఊడి ఉంటే వాటికి మరమ్మతులు చేయిస్తాం. **- నూరుల్ నజీబ్, కమిషనర్, అమరచింత**

అమరచింత, న్యూస్‌టుడే

తెరపై ఈనాడు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : శ్రీనివాస: **దేవర**
వెంకటేశ్వర: **రామ్‌నగర్‌బన్నీ** , శ్రీరామా: **శ్వాగ్**

నేడు జీవ వైవిధ్య రచ్చబండ సమావేశాలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలం పరిధిలోని గుంటిపల్లి, మేడేపల్లి, మోట్లంపల్లి, దేవర్‌పల్లి, తిప్పడంపల్లి, జూరాల గ్రామాల్లో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జీవ వైవిధ్యంపై రచ్చబండ సమావేశాలు నిర్వహిస్తున్నామని ఎంపీవో శ్రీరాంరెడ్డి తెలిపారు. జీవ వైవిధ్య కమిటీ జిల్లా సమన్వయకర్త ఆదేశాల మేరకు ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన జీవ వైవిధ్య రచ్చబండ కార్యక్రమాలను గ్రామస్థులు జయప్రదం చేయాల్సిందిగా కోరారు. గ్రామ కార్యదర్శులు, పంచాయతీల సిబ్బంది నిర్దేశించిన గ్రామాల్లో ప్రజలకు విధిగా సమాచారాన్ని చేరవేయాలన్నారు.

నేడు ఆశ కార్యకర్తల చలో కలెక్టరేట్

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణ ఆశ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుచ్చమ్మ, సునీతలు ఆదివారం తెలిపారు. ఆశ వర్కర్లతో బీపి, చెక్కెర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆశ దినోత్సవం రోజున వైద్యాధికారులు ఆదేశించారని, రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జిల్లాలో ఆశ వర్కర్లతో చేయించడం సరైనది కాదన్నారు. పారితోషికం లేని పనులు, సంబంధంలేని పనులు చేయించవద్దని, పనిభారాన్ని తగ్గించాలని ప్రభుత్వాని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముందు ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

గోపాల్‌పేట, న్యూస్‌టుడే: ఆరోగ్యం కోసం ఆసుపత్రులకు వెళ్లిన బాధితులను ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి డబ్బులను అందజేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని ఏఐపీసీ రాష్ట్ర కో- ఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యరెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తిలోని ఆయన నివాసంలో గోపాల్‌పేట మండలానికి చెందిన ఆరుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు.

వాగులో రాతి విగ్రహాలు లభ్యం



కొత్తకోట: చేతిలో బల్లెంతో ఉన్న మహిళ విగ్రహం

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తకోట సమీపంలోని పాలెం వాగులో ఆదివారం మధ్యాహ్నం మూడు రాతి విగ్రహాలు లభ్యమయ్యాయి. పాత హనుమాన్ ప్రాంతంలో ఉన్న వాగు ఒడ్డున పొలానికి వెళ్లిన రైతులకు రాత్రి విగ్రహాలు కనిపించాయి. రాత్రి విగ్రహాల్లో ఓ రాతిపై మహిళ బల్లెం పట్టుకొని ముందుకు అడుగులు వేస్తున్నట్లు ఉంది. మరో దానిపై ఒక పురుషుడు చేతిలో వస్తువును పట్టుకొని ఉన్నాడు. మరో రాయిపై శివలింగంతో పాటు లిపి రాసినట్టు ఉంది. పూర్వం ఇక్కడ వెంకటాపురం అనే గ్రామం ఉండేదని అక్కడి నుంచి గ్రామం తరలిపోవడంతో వాగు సమీపంలో ఉన్న ఆలయాలు వరదలకు కొట్టుకుపోయి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఇసుకలో నుంచి విగ్రహాలు బయటకు తేలినట్లు రైతులు చెప్పారు. దీనిపై అధికారులకు సమాచారం అందించినట్లు వారు వివరించారు.

మార్కెట్ కమిటీ అధ్యక్షురాలికి సన్మానం

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ నూతన అధ్యక్షురాలు ప్రమోదినిరెడ్డి, ఉపాధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అరుంధతిరెడ్డిలను రెడ్డి సేవా సమితి సభ్యులు ఆదివారం సన్మానించారు. రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు వేమారెడ్డి, ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, మనోహర్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, మేఘారెడ్డి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గడువు ముగిసింది.. బకాయి మిగిలింది!

జిల్లాలో 3,05,345 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వని మిల్లర్లు



పెబ్బేరు శివారులోని ఓ బియ్యం మిల్లు గోదాంలో సీఎంఆర్ ధాన్యం

పెబ్బేరు, న్యూస్‌టుడే: నాలుగేళ్లలో ఏడు సీజన్లకు సంబంధించిన సీఎంఆర్‌ను మిల్లర్లు ప్రభుత్వానికి సక్రమంగా ఇవ్వలేదు. దీనికి సంబంధించిన గడువు సెప్టెంబరు 30తో ముగిసింది. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లర్లకు కేటాయించగా.. క్వింటా వరి ధాన్యానికి మర ఆడించి 67 శాతం బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలి. ఏడు సీజన్లకు చెందిన సీఎంఆర్‌ను ప్రభుత్వానికి మిల్లర్లు బాకీ పడ్డారు. పలు మార్లు గడువు పెంచినా మిల్లు యజమానులు అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ వచ్చారు. మిల్లర్లు ప్రస్తుతం జిల్లాలో 3,05,345 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఈ బియ్యం విలువ రూ.1,002 కోట్లు ఉంది. కేవలం వనపర్తి జిల్లా మాత్రమే రూ.వెయ్యి కోట్లకు పైగా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎంత బకాయి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ బియ్యం ఇచ్చేందుకు ప్రభుత్వం మళ్లీ గడువు పొడిగించలేదు. బియ్యం ఇవ్వని మిల్లర్లపై పౌరసరఫరాల సంస్థ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

> మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ గడువు సెప్టెంబరు 30 నాటికి ముగిసింది. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం అధికారులు చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్‌ను మిల్లర్లు ఇచ్చి తీరాల్సిందే.
> **-ఇర్ఫాన్, డీఎం, పౌరసరఫరాల సంస్థ**

రికవరీ ఎలా..

జిల్లాలో ప్రస్తుతం 190 బియ్యం మిల్లులుండగా వీటిలో 10 మిల్లులు మాత్రమే బాయిల్డ్. మిగతావి రా మిల్లులే. బియ్యం మిల్లులు, వారికి సంబంధించిన గోదాంలలో సీఎంఆర్ ధాన్యమే లేకుండా బియ్యం ఎలా ఇస్తారనేది ప్రశ్నార్థకంగా ఉంది. ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని మిల్లర్లు పక్కదారి పట్టించి భారీగా సొమ్ము చేసుకున్నారు. జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ పెబ్బేరు పోలీసులకు పలుమార్లు పట్టుబడటంతో కేసులు సైతం నమోదయ్యాయి. జిల్లాలోని పలు మిల్లుల్లో గతేడాది డిసెంబరు నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు చెందిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పెద్ద ఎత్తున దాడులు నిర్వహించి రూ.120 కోట్లు విలువైన ధాన్యం మిల్లర్ల వద్ద లేనట్లు గుర్తించారు. ఈ మిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులు సైతం నమోదు చేశారు. మిగతా మిల్లుల్లో కూడా పూర్తి స్థాయిలో దాడులు చేస్తే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉందని జిల్లా వాసులు అంటున్నారు.

డిఫాల్ట్ కింద 107 మిల్లులు..

జిల్లాలో ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వని 107 మిల్లులను డిఫాల్ట్ కింద చేర్చారు. వీటిలో 43 మిల్లులపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు చేపట్టారు. కొన్ని చోట్ల తహసీల్దార్లు మిల్లు యజమానుల ఇళ్లలోని వస్తువులను కొంత జప్తు చేశారు. ఆర్ఆర్ చట్టం ప్రకారం నూటికి 125 శాతం వసూలు చేయాలని, లేకుంటే వాటికి సంబంధించిన ఆస్తులు జప్తు చేయాలని ఆయా మండలాల రెవెన్యూ అధికారులు కలెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. మిల్లర్లకు కొంత రాజకీయ అండ ఉండటంతో చర్యలకు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

సంవత్సరం	సీజన్	ఇవ్వాల్సిన బియ్యం (మెట్రిక్ టన్నుల్లో)	విలువ (రూ.కోట్లలో)
2020-21	యాసంగి	779	2.50
2021-22	వానాకాలం	2,900	9
2021-22	యాసంగి	2,005	6.30
2022-23	వానాకాలం	40,163	130
2022-23	యాసంగి (టెండర్)	1,34,000	422
2023-24	వానాకాలం	75,280	259
2023-24	యాసంగి	50,218	173
	మొత్తం	3,05,345	1,001.80

యువతకు ప్రాధాన్యం: మంత్రి



అమ్మవారి దర్శనానికి వస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యే విజయుడు తదితరులు

అలంపూర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ప్రాధాన్యం ఇస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం అలంపూర్ హరిత టూరిజంలో విలేకరులతో మాట్లాడారు. భారాస ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇవ్వకనే నిరుద్యోగ సమస్య పెరిగిందని ఆరోపించారు. తెలంగాణ ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పటిష్ఠం చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. వివిధ శాఖల్లో 60 వేల ఉద్యోగాలను 10 నెలల్లో భర్తీ చేశామని మంత్రి పేర్కొన్నారు. డీఎస్సీ పరీక్షలు నిర్వహించామని, మరో రెండు రోజుల్లో ఉద్యోగ నియామక పత్రాలు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేస్తామని మంత్రి వివరించారు. యువతలో నైపుణ్యం పెంచేందుకు ప్రతి జిల్లాలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలంపూర్ ఆలయాల అభివృద్ధికి పురావస్తు శాఖతో సంప్రదించి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు మంత్రి ఆలయాలను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి ఆలయంలో రుద్రహోమం, అభిషేకం, జోగులాంబ ఆలయ సన్నిధిలో చండీహోమం నిర్వహించారు. ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత దంపతులు, తదితరులున్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు కోర్టు సమన్లు

- వచ్చేనెల 19న హాజరువాలని సూచన

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమం సకల జనుల సమ్మె నేపథ్యంలో బస్సులను అడ్డుకున్నారన్న అభియోగంతో 28 మంది ఉద్యోగులకు కోర్టు నుంచి సమన్లు అందాయి. మలిదశ ఉద్యమం సకల జనుల సమ్మెలో ఆర్టీసీ కార్మికులు పాల్గొని బస్సులు రోడ్డు మీదకు రాకుండా అడ్డుకున్నారు. అప్పట్లో ఆర్టీసీ టీఎంయూ సంఘం నాయకులు నిర్వహించిన ధర్నాలో ఐకాస ఉమ్మడి జిల్లా సమన్వయకర్తగా ఉన్న చంద్రా నాయక్‌తో పాటు మరో 27 మందిపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో నలుగురు మహిళా ఉద్యోగినులు కూడా ఉన్నారు. 2024 నవంబర్ 19న రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ద్వారా మహబూబ్‌నగర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుకావాలని సమన్లు అందాయి. 13 ఏళ్ల క్రితం ఉద్యమం సందర్భంగా కేసులు నమోదయ్యాయని, వాటిని కొట్టివేశారని అనుకున్న దశలో కోర్టుకు హాజరుకావాలని సమన్లు వచ్చాయని చంద్రానాయక్ ఆవేదన వ్యక్తంచేశారు.

జగన్మాతా..పాహిమాం



వనపర్తి పట్టణం వల్లభ్‌నగర్‌లో గౌరీదేవి అలంకరణలో..



నాగవరం కోదండరామస్వామి ఆలయంలో లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గామాత



ఖిల్లాగణపురంలో లలితా త్రిపుర సుందరిదేవిగా..



కొత్తకోట: అంబాభవానీ ఆలయంలో...



చిన్న చౌడేశ్వరీ ఆలయంలో..



అమరచింత: కాళికాలయంలో ధనలక్ష్మీ అలంకరణలో అమ్మవారు



అంకూర్‌లో ప్రత్యేక అలంకరణలో...



అమరచింత: జగన్‌వాడలో..



వనపర్తి అయ్యప్ప ఆలయంలో కుంకుమార్చనలో మహిళలు



కొత్తకోట: అంబాభవానీ ఆలయంలో మాజీ ఎంపీ రావుల పూజలు



కొత్తకోట: కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

శక్తి స్వరూపిణి దుర్గమ్మ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు లలితాత్రిపుర సుందరిదేవిగా, వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఆయా ఆలయాలు, మండపాల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. మండపాల వద్ద చిన్నారులు భక్తి పాటలకు నృత్యాలు ఆకట్టుకున్నాయి. అమరచింత మండంలోని కాళికాలయంలో అమ్మవారు రూ.6,30,000లతో ధనలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. జగన్‌వాడలో రూ.8,21,000లతో అలంకరించారు. కొత్తకోట పట్టణంలోని శ్రీ అంబా భవాని శంకరాలయంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో మహిళలు కుంకుమార్చన చేశారు.

-న్యూస్‌టుడే బృందం

రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపిక

పెబ్బేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని మీనాక్షి రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికైంది. ఈనెల 2న వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించింది. ఈ నెల 7, 8వ తేదీల్లో హనుమకొండలో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పాల్గొంటున్నట్లు పాఠశాల డైరెక్టర్ రంగారెడ్డి చెప్పారు. ఎంపికైన విద్యార్థిని కౌన్సిలర్ గోపి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతిభావంతునికి హీరో సుమన్ సత్కారం



రవికిరణ్‌ను సన్మానిస్తున్న హీరో సుమన్, గౌడ సంఘం నాయకులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణానికి వచ్చిన సినీ హీరో సుమన్‌ను ఆదివారం జిల్లా గౌడ సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మదనాపురం మండలం దుప్పల్లికి చెందిన రవికిరణ్ గౌడ్‌ను సుమన్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు నరేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

గొలుసు దుకాణానికి వేలం

పెద్దమందడి, (వనపర్తి న్యూటౌన్) : పెద్దమందడి మండలంలోని అమ్మపల్లి గ్రామంలో ఆదివారం గొలుసు దుకాణం నిర్వహణ కోసం వేలం నిర్వహించారు. ఈ వేలంలో నలుగురు వ్యక్తులు పాల్గొన్నారు. కొందరు వ్యక్తులు మద్యం అమ్మకాలు నిషేధించాలని వేలం నిర్వాహకులకు చెప్పిన పట్టించుకోలేదు. క్వాటర్ మద్యం సీసా నుంచి ఎమ్మార్పీతో పాటు అదనంగా రూ.20 అమ్మాలని నిర్ణయించారు. దుకాణం కోసం రూ.1.62 లక్షలకు ఓ వ్యక్తి దక్కించుకున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' కొత్తకోట ఎక్సైజ్ సీఐ కరుణను వివరణ కోరగా... వేలం నిర్వహిస్తున్నట్లు ఎలాంటి సమాచారం రాలేదన్నారు. గ్రామంలో మద్యం నిర్వహించేందుకు వేలం నిర్వహించే ప్రసక్తే లేదన్నారు. సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటామన్నారు.

క్రీడలతో స్నేహభావం

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలతో యువత మధ్య స్నేహ భావం పెంపొందుతుందని కొత్తకోట సీఐ రాంబాబు అన్నారు. దసరా పండుగ సందర్భంగా పట్టణంలో ఆరోగ్య క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నీని ఆదివారం సీఐ ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. పోటీల్లో మొత్తం తొమ్మిది జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు శేఖర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, శివ, రామకృష్ణ, రవీందర్‌రెడ్డి, బాలకృష్ణ, నవీన్, కృష్ణ, రవి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ఒకే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 22 ఏళ్ల తరువాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. పెబ్బేరు జిల్లా ప్రాథమిక పాఠశాలలో 2001-2002వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు బాలస్వామి, సింగన్న, రంగనాథ్, ధర్మారెడ్డిలను సన్మానించారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు



ఆత్మకూరు గాంధీచౌక్ కూడలిలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న పుర ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మనోహర్‌గౌడ్

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు పట్టణంలో ఆదివారం బీజేవైఎం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గాంధీచౌక్ కూడలిలో శిబిరాన్ని ఏర్పాటు చేసి పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను శిబిరంలోకి ఆహ్వానించి, పార్టీలో చేరాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు పుర ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మనోహర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకులు కంబళాపురం రాము, ఓబీసీ నాయకులు అశోక్‌భూపాల్, అశోక్‌నంద, ఆత్మకూరు పట్టణ ప్రధాన కార్యదర్శి మండ్ల సూరి, ఎస్సీ మోర్చా నాయకులు బోరెల్లి రాము, మైనార్టీ విభాగం జిల్లా నాయకులు సమ్మద్ పాల్గొన్నారు.

గోపాల్‌పేట, న్యూస్‌టుడే: జిల్లాలో భాజపా సభ్యత్వాల నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులను ఆదుకోవడానికి ప్రధానమంత్రి మోదీ అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు వామన్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్‌ఓసీ అందజేత



రామచంద్రయ్యకు ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పానగల్, వనపర్తి న్యూటౌన్ : గోపాల్‌పేట మండలం కేశంపేట గ్రామానికి చెందిన రామచంద్రయ్య అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుని గురించి నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి వనపర్తిలోని ఆయన నివాసంలో రూ.ఒక లక్ష ఎల్‌ఓసీని ఆదివారం బాధితుడికి అందజేశారు. నాయకులు సత్యశీలారెడ్డి, సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి సేవలో నాయకులు

ఇటిక్యాల, అలంపూర్, న్యూస్‌టుడే: బీచుపల్లి ఆంజనేయ స్వామిని ఎంపీ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం మండలానికి వచ్చిన వారికి పార్టీ నేతలు గజమాలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. ఈవో రామన్‌గౌడ్ వారికి స్వామి వారి శేషవస్త్రాలు సమర్పించారు. ఇటిక్యాల, ఎర్రవల్లి మండల అధ్యక్షులు రుక్మందర్‌రెడ్డి, వెంకటేశ్, జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ సరిత, జోగుల రవి, లక్ష్మినారాయణరెడ్డి, గ్రంథాలయ ఛైర్మన్ నీలి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

పాన్‌గల్, న్యూస్‌టుడే: 2000-21 సంవత్సరం పదో తరగతికి చెందిన విద్యార్థులు తమతో పాటు చదువుకుని ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సహచరుడి కుటుంబానికి తమ వంతుగా చేయూత అందించారు. పాన్‌గల్ మండలం రేమద్దుల గ్రామానికి చెందిన ఆత్మకూర్ కురుమయ్య గత నెలలో మృతిచెందాడు. ఆదివారం సహచరులు కురుమయ్య భార్య పద్మకు రూ. 50వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో శాలయ్య, కుమార్, శ్రీబాబు, గిరిబాబు, రాజేందర్, సహదేవ్, తిరుపతయ్య పాల్గొన్నారు.

సొంత డబ్బులతో రహదారికి మరమ్మతులు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: ఖిల్లాగణపురం మండల పరిధిలోని దొంతికుంట తండాకు చెందిన రైతులు కుంటమందరి తండా మీదుగా ఆముదంబండ తండాకు వెళ్లే రహదారి గుంతలమయమై కంకర తేలి ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని దుస్థితి ఉండటంతో ఆదివారం సొంత డబ్బులతో రహదారిపై ఎర్రమట్టి పోసి జేసీబీతో చదును చేశారు. రైతులు క్రిష్ణ, జుంపాల్, సామ్య, జైపాల్, శంకర్, వాచ్య తదితరులున్నారు.


ప్రజా ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



బీటీ రహదారి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాటవెల్లి నుంచి ముమ్మళ్లపల్లి వరకు చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రజల మెరుగైన జీవన విధానానికి రవాణా రంగం అతి ముఖ్యమైందన్నారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు బీచ్‌పల్లి, కృష్ణారెడ్డి, శివరాములు, కుర్మయ్య, శ్రీనువాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రామన్నగట్టు జలాశయం పనులు చేపట్టాలి



గత ప్రభుత్వం ఇచ్చిన జీవో పత్రాన్ని చూపుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు

పాన్‌గల్, న్యూస్‌టుడే: రైతుల సౌకర్యార్థం గత భారాస ప్రభుత్వం మంజూరు చేసిన రామన్నగట్టు జలాశయం పనులు ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని కిష్టాపూర్ సమీపంలో ఆ ప్రాంతాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ఏడాది క్రితం జలాశయం నిర్మాణానికి ప్రభుత్వం జీవో ఇచ్చిన నేటికి ఎలాంటి పురోగతి లేదన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం అని ప్రగల్భాలు పలుకుతున్న నాయకులు రిజర్వాయర్ పనులు మొదలుపెట్టి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. జలాశయం పూర్తి చేస్తే పాన్‌గల్ మండలంలో గ్రావిటీ ద్వారా సాగునీరు పారి సస్యశ్యామలంగా మారుతుందని దీంతో రైతుల కష్టాలు తీరుతాయన్నారు. స్థానిక మంత్రి దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణ విషయంలో నిర్లక్ష్యం చేస్తే రైతాంగం తరపున భారాస ముందుండి ఉద్యమం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌నాయక్, వెంకటయ్య, వీరసాగర్, రాజేశ్వర్‌రెడ్డి, బాలస్వామి, శివారెడ్డి, చంద్రునాయక్, కర్ణాకర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని..మహిళ మృతి

అమరచింత, న్యూస్‌టుడే: మండలంలోని పామిరెడ్డిపల్లె, కొంకలవానిపల్లె గ్రామాల మధ్యలో మరికల్ ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని శారద (50) మృతి చెందింది. మృతురాలు గత కాలంగా అమరచింత పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవిస్తుంది. మృతురాలిది చిన్నకడుమూర్ గ్రామం అని తెలిసిందని. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.సురేశ్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెద్దమందడి, (వనపర్తి న్యూటౌన్), న్యూస్‌టుడే: పెద్దమందడి మండలంలోని వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో వనపర్తికి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇసుకను తరలించేందుకు అనుమతిపత్రాలివ్వమని ట్రాక్టర్ డ్రైవర్ బాలరాజును అడగగా ఇవ్వలేదు. దీంతో ట్రాక్టర్‌ను పోలీసు సిబ్బంది నరేశ్, జగదీశ్‌లు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసు సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్‌రెడ్డి తెలిపారు.

ముగ్గురు వాహనదారులపై కేసు నమోదు

గోపాల్‌పేట : మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేశామని ఎస్సై హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం సాయంత్రం గోపాల్‌పేటలో ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టి సుమారు 15 మందిని పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని, వారిపై కేసులు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.